క్లుప్తంగా

మెనూ తప్పనిసరి

డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్



అంతారం పాఠశాలను పరిశీలిస్తున్న విజయేందర్

ధారూరు: మండల పరిధిలోని అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాలను మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ సందర్శించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వాహణ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అంతారం మాజీ సర్పంచ్ నర్సిరెడ్డి గ్రామస్తులున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం



ప్లేట్లను చూపుతున్న విద్యార్థులు

కుల్కచర్ల: పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని బీజేపీ నేతలు చిన్న వెంకటయ్య, ఆంజనేయులు అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలోని ఘణపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, ఎలక్ట్రిక్ బెల్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల అభ్యున్నతి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లక్ష్మి, గ్రామస్తులు హన్మంతు, శ్రీనివాస్, నర్సింహులు, ఆంజనేయులు, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

కాంగ్రెస్ ఎ–బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు



మందులు పంపిణీ చేస్తున్న నర్సింలు

పెద్దేముల్: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఎ–బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఎల్ఎన్ఆర్ యువసేన సహకారంతో వికారాబాద్ మహవీర్ జనరల్ ఆస్పత్రి నేతృత్వంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అడిగిన వెంటనే వైద్య సేవలు అందిస్తున్న మహవీర్ ఆస్పత్రి వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీనే ముద్దు

నస్కల్ గ్రామస్తుల నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

పరిగి: మండల పరిధిలోని నస్కల్ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని మంగళవారం ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రాజకీయ నాయకుల స్వలాభం కోసం మున్సిపాలిటీలో కలిపితే ఊరుకోమని హెచ్చరించారు. మున్సిపల్ కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీని మున్సిపాలిటీలో ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. రైతులకు నష్టం చేకూర్చేందుకే విలీన ప్రక్రియ తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సునీల్

పరిగి: పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా యాదయ్య, కార్యదర్శిగా జంగయ్య, సలహాదారుడిగా వెంకటేష్, శ్రీనివాసు, కోశాధికారిగా బాలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సునీల్ కుమార్ మాట్లాడుతూ.. పెయింటర్‌ల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.

పుస్తకాల పంపిణీ

బొంరాస్‌పేట: యూత్ ఫర్ సేవా సంస్థ, టీవీవీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపకరిస్తాయని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీవీవీ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుద్యాల అభివృద్ధికి పెద్దపీట



దుద్యాల పంచాయతీ కార్యాలయం

- మండల సమీకృత భవన నిర్మాణానికి రూ.8.50కోట్ల నిధులు
- అంగన్వాడీ, పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి మరిన్ని నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు

దుద్యాల్: రెండేళ్ల క్రితం ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో ఎలాంటి కార్యకలాపాలు కొనసాగడం లేదు. స్థానిక ఉర్దూ పాఠశాలలో రెవెన్యూ కార్యాలయం, జెడ్పీహెచ్ భవనంలో మండల విద్యావనరుల కేంద్రం కొనసాగుతోంది. మిగిలిన కార్యాలయాలన్నీ పాత మండలంలోనే కొనసాగుతున్నాయి. దీంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. గత ప్రభుత్వం మండలం ఏర్పాటు చేసినప్పటికీ అధికారులను మాత్రం నియమించలేకపోయింది. రెవెన్యూపరంగా ఇబ్బందులు వస్తున్నాయని తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మండల పరిషత్, వ్యవసాయ, పోలీస్ స్టేషన్‌తో పాటు ఇతర కార్యాలయాలకు మాత్రం పాత మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. ఈ క్రమంలో నూతన మండల వాసులు నిరంతరం అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం.. దినపత్రికల్లో వస్తున్న వరుస కథనాలు ఇస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి మండల అభివృద్ధికి నిధులు కేటాయించారు. రెండు రోజుల క్రితం నియోజకవర్గానికి విడుదల చేసిన రూ.43.75 కోట్ల నిధుల్లో దుద్యాలలో నిర్మించే మండల సమీకృత భవనాల నిర్మాణానికి రూ.8.50కోట్లు కేటాయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సమీకృత భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి(ఫైల్)

విద్యకు ప్రాధాన్యం

ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన రూ.8.50కోట్లతో పాటుగా పాఠశాలలు, అంగన్వాడీల నిర్మాణానికి మరిన్ని నిధులు మంజూరు కేటాయించేందుకు కడా అధికారి సన్నాహాలు చేస్తున్నారు. దుద్యాల జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధన విడివిడిగా కొనసాగిస్తున్నారు. దీంతో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. అదనపు గదులు నిర్మాణ అసంపూర్తిగా మిగిలిపోవడంతో వాటిని పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పోలపల్లి గ్రామంలో పాఠశాల నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల పరిధిలోని మెజార్టీ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. అవసరమైన గ్రామాలను గుర్తించి నిధులు కేటాయించేలా చూస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే హకీంపేట్‌లో జూనియర్ కళాశాల, ఐటీఐ, పీహెచ్‌సీ ఏర్పాటు చేసింది.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



మండల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత ప్రభుత్వం మండల ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు, కార్యాలయాలు ఏర్పాటు చేయకుండా మండల ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మండల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అభివృద్ధి పనులకు త్వరితగతన పూర్తి చేసేందుకు సహకరిస్తాం.

– మెరుగు వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, దుద్యాల

మరిన్ని నిధులు కేటాయిస్తాం



ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో దుద్యాలలో సమీకృత భవనాల నిర్మాణానికి రూ.8.50కోట్లు మంజూరయ్యాయి. ఇతర మండలాల్లోనూ అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు గ్రామాల వారీగా మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే రైతు వేదిక సమీపంలో సమీకృత భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశాం. మరో రెండు ప్రదేశాల్లోనూ స్థల పరిశీలన చేశాం. త్వరలోనే ఎక్కడ నిర్మించాలనేది నిర్ణయించి పనులు ప్రారంభిస్తాం.

– వెంకట్ రెడ్డి, కడా ప్రత్యేక అధికారి



కరన్‌కోట్‌లో రేవంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌లో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. కరన్‌కోట్ గ్రామం నుంచి బషీరాబాద్ మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను చూసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్ జర్నప్ప, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, భరత్ కిషోర్, సునీల్, మొగులప్ప, శివకుమార్, సుధీర్, అల్తాఫ్, అహ్మద్, వేణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుతో పెనుముప్పు

మెడికల్ ఆఫీసర్ మానస

బంట్వారం: ఉప్పు అధికంగా వాడడంతో అనర్థాలు చోటు చేసుకుంటాయని మెడికల్ ఆఫీసర్ మానస అన్నారు. ప్రపంచ ఐయోడిన్ లోప రుగ్మతల దినోత్సవం సందర్భంగా మంగళవారం బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రోజు ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోవద్దన్నారు. భోజనంలో పోషక ఆహారం, తాజా పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు ఉండేలా చూడాలన్నారు. వంటకాలలో ఐయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. కొవ్వు తక్కువ ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐయోడిన్ లోపంతో సంక్రమించే వ్యాధులు, నివారణ మార్గాలు, తదితర అంశాలపై ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం

న్యాయ చట్టాలపై అవగాహన అవసరం

దుద్యాల్: నూతన న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడ్వకేట్ బుస్స శకనప్ప అన్నారు. మంగళవారం ఆయన స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గతంలో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ అమలులో ఉండేవాని వాటికి బదులుగా బీఎన్ఎస్, బీఎస్ఎస్ఎస్ చట్టాలు తీసుకువచ్చారన్నారు. కొత్త చట్టాల ద్వారా శిక్ష స్థాయి, పూచీకత్తు(డబ్బు) పెంచారన్నారు. విద్యార్థులు అనవసర గొడవల్లో తలదూర్చి కేసులపాలు కావద్దని సూచించారు.

బీజేపీలో మహిళలకు సముచిత స్థానం

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష

మర్పల్లి: బీజేపీలో మహిళలకు సముచిత స్థానం ఉంటుందని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కూరగాయ సంతలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ, పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీ సభత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణమే బీజేపీ లక్ష్యమన్నారు. మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు మాధవి, మహేశ్వరి, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మోహన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్లు రాఘవేందర్, మల్లికార్జున్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి నాగయ్య, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, శాంతప్ప, మండల నాయకులు జైపాల్, శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిరీష

పెద్దేముల్‌లో భారీ వర్షం

పెద్దేముల్: పెద్దేముల్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిన వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పత్తి పంటలు పాడవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌పూర్, మారేపల్లి, గాజీపూర్, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల రైతులు పంటలు పాడవ్వడంతో పెట్టుబడి వచ్చేలా లేదంటూ వాపోతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో 30శాతం పంటలు పాడయ్యాయని ఈ వర్షంతో పంటలు పూర్తిగా పాడై అప్పుల పాలవుతామని ఆందోళన చెందుతున్నారు.



పెద్దేముల్‌లో కురుస్తున్న వర్షం

పోరాట యోధుడు కొమురంభీమ్

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్



జయంతి వేడుకలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

పరిగి: కొమురంభీమ్ ఆదివాసీ ఆత్మగౌరవ పోరాట యోధుడు అని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో కొమురంభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆదివాసుల కోసం జల్ జంగల్ జమీన్ ఉద్యమ జ్వాల రగిల్చిన యోధుడు కొమురంభీమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, బాలకృష్ణ, అంబర్‌సింగ్, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో గుర్తింపు లేదు

పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామగోవర్ధన్‌రెడ్డి



దోమ: కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యం లేకుండా పోయిందని పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామగోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీలో కొంత మంది నేతల తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. పార్టీ వ్యవహారాలు, అధికారిక సమావేశాలకు సైతం తమను ఆహ్వానించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలలో తాము బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశామన్నారు. సీనియర్ కార్యకర్తలకు సముచిత స్థానం, గౌరవం చూపకపోవడం సరికాదన్నారు. కొంత మంది నేతల తీరు పార్టీకి నష్టం కలిగించేలా ఉందని.. జాగ్రత్తలు తీసుకోకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఆయుర్వేద కంటి శిబిరానికి స్పందన

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధన్వంతరి ఆయుర్వేద కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. తమిళ సంప్రదాయ కంటి నిపుణులు ముత్తు కృష్ణన్ వారసుల పర్యవేక్షణలో మంగళవారం శిబిరం ఏర్పాటు చేశారు. తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి కంటి చుక్కలు వేయించుకున్నారు. ప్రతీ నెల 2వ, 4వ మంగళవారాలు కంటి చుక్కల మందు వేస్తామని నిర్వాహకులు తెలిపారు.



తాండూరు రూరల్: చెంగోల్ జెడ్పీహెచ్ఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దేముల్‌లో..

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

ధర్మాగ్రహ దీక్షలో ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న డీఏలు, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, పెన్షన్, సప్లమెంటరీ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమం చేపట్టారు. చెంగోల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సానాయక్, తపస్ మండల అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు నర్సప్ప, సరస్వతి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన విరామ సమయంలో..

పెద్దేముల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని మారేపల్లి, పెద్దేముల్, తట్టెపల్లితో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వం చేసిందేమీ లేదు

బషీరాబాద్: డీఏ, పీఆర్సీతో పాటు పెండింగ్ బిల్లుల సాధన కోసం తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఒకటో తారీఖున జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్పా ఉపాధ్యాయులకు కొత్తగా ఒరగబెట్టింది ఏమీలేదని విమర్శించారు. ఎమర్జెన్సీకి సంబంధించిన మెడికల్ బిల్లులు సైతం పదినెలలుగా చెల్లింకపోవడం వంటి ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ ఆధ్వర్యంలో రోజుకొక తీరున నిరసన తెలుపుతామని గాజుల వీరేశం తెలిపారు.

నేటి నుంచి తిరుమలనాథ స్వామి ఉత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో కొలువుదీరిన తిరుమలనాథ స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 23న బుధవారం ఉదయం గీతాయజ్ఞం, 24న గురువారం స్వామివారి రథోత్సవం, పూల వసంతోత్సవం, 25న శుక్రవారం స్వామివారి ఏకాంతసేవ, మానస పూజ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పీఠాధిపతి వెంకటదాసు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్‌లో 3, 4 వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. తాగునీటి సమస్యతో పాటు దోమల బెడదతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

యూఎస్ఎఫ్ఐ కళాశాల కమిటీ నియామకం

పెద్దేముల్: యూఎస్ఎఫ్ఐ జూనియర్ కళాశాల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి సమక్షంలో కమిటీ నియామకం జరిగిందని మండల అధ్యక్షుడు నవీన్ ఓ ప్రకటనలో తెలిపారు. యూఎస్ఎఫ్ఐ కళాశాల అధ్యక్షుడిగా స్వరాజ్, ఉపాధ్యక్షుడిగా భాస్కర్, మహిళా అధ్యక్షురాలిగా స్రవంతి, ఉపాధ్యక్షురాలిగా పూజ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్, సంతోష్, కార్తీక్, సోనియ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశం గుప్తా సతీమణి పద్మావతి మృతి చెందడంతో మంగళవారం దశదిన కర్మ నిర్వహించారు. ఈ మేరకు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి హాజరై పద్మావతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరి ఆనందం, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



పద్మావతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

నివాళి అర్పించిన పార్టీ శ్రేణులు

బొంరాస్‌పేట: నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న రేగడిమైలారం గ్రామానికి చెందిన గుర్మిట్‌కల్ నర్సిరెడ్డి(68) మంగళవారం తెల్లవారుజామున మృత్యువాతపడ్డారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా నర్సిరెడ్డి పార్టీకి, గ్రామానికి ఎనలేని సేవలందించారన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నర్సిరెడ్డి అంత్యక్రియల్లో తిరుపతిరెడ్డితో పాటుగా నందారం ప్రశాంత్, పార్టీ మండల నాయకులు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింలు నాయుడు, నాయకులు గుండప్ప, చంద్రప్ప, గోవింద్‌రెడ్డి, అంజిలయ్య తదితరులున్నారు.



అంతిమయాత్రలో పాల్గొన్న తిరుపతిరెడ్డి, నాయకులు

ప్రభుత్వ ఉపాధ్యాయినులకు సన్మానం



అక్కాచెల్లెలను సన్మానిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

తాండూరు: ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అక్కాచెల్లెలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యాలాల మండలం జుంటిపల్లి గ్రామానికి చెందిన మొగులప్ప ఇద్దరు కూతుళ్లు వినీష, శిరీష ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో యాదవ సంఘం ప్రతినిధులు మంగళవారం అక్కాచెల్లెలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాండూరు అధ్యక్షుడు రాజుయాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి బస్వరాజ్ యాదవ్, నాయకులు మల్లేశం యాదవ్, గోపాలకృష్ణయాదవ్, లాలుయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, గుండప్ప యాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.